క్లుప్తంగా

న్యాయం చేయాలని ఎస్పీకి వినతి

అర్ధవీడు: కల్లంలో ఆరబెట్టిన మిర్చి, మొక్క జొన్న కొందరు వ్యక్తులు నిప్పంటించారని, పోలీస్ స్టేషన్‌కు నాలుగుసార్లు వెళ్లినా ఎస్సై పట్టించుకోవడంలేదని బాధితుడు కొంకాల చిన్నరాజయ్య సోమవారం జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. బాధితుడు మాట్లాడుతూ మార్చి 28న తన పొలంలో ఆరబెట్టి ఉన్న సుమారు రూ.7 లక్షల విలువైన 50 క్వింటాళ్ల మిరప, మొక్కజొన్న కండెలు కాలిపోయాయన్నారు. ఈనెల 4వ తేదీన ఎస్సై సుదర్శన్‌కు ఫిర్యాదు చేశానని అప్పటి నుంచి పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపాడు. పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరిగినా న్యాయం జరగక పోవడంతో ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

పాఠశాలకు ఫ్యాన్ల వితరణ



సీలింగ్‌ఫ్యాన్‌ను బహూకరిస్తున్న పూర్వ విద్యార్థులు

కొమరోలు: మండలంలోని హనుమంతరాయునిపల్లె ఎంపీపీ పాఠశాలకు పూర్వ విద్యార్థులు సోమవారం సీలింగ్ ఫ్యాన్లను బహూకరించారు. ఎంపీపీ పాఠశాలలో స్కూల్‌డే నిర్వహిస్తున్న సందర్భంగా పూర్వ విద్యార్థులు ఫ్యాన్లను, విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగూర్‌వలి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఇంటిబాట పట్టిన ఉపాధ్యాయులు



ఓ ఇంట్లో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

కొమరోలు: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల ఇంటిబాట పట్టారు. సోమవారం మండలంలోని తాటిచెర్ల, బొద్దువానిపల్లె, గుంతపల్లి, పి.పొట్టిరెడ్డిపల్లి, కె.బొంతపల్లి, బొద్దువానిపల్లి, ఇడమకల్లు, ద్వారకచర్ల ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు గ్రామాల్లో కలియతిరిగి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న వివిధ పథకాలపైన తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

మంజూరు పత్రాల అందజేత



మంజూరు పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కందుల

తర్లుపాడు: మండలంలోని బీసీ కార్పొరేషన్ లబ్ధిదారులకు ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి సోమవారం మంజూరు పత్రాలను అందచేశారు. త్వరలో ఎస్సీ, బీసీలకు రుణాలు మంజూరు అవుతాయని చెప్పారు. వివిధ గ్రామాలకు చెందిన 30 మంది లబ్ధిదారులకు పత్రాలు అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, ఎంపీడీవో చక్రపాణి ప్రసాద్, ఈఓఆర్డీ సుకుమార్, అధికారులు పాల్గొన్నారు.

భక్తులకు మజ్జిగ, బిస్కెట్లు పంపిణీ



జెండా ఊపి వాహనాన్ని ప్రారంభిస్తున్న అన్నా కృష్ణచైతన్య

మార్కాపురం: లక్ష్మిచెన్నకేశవస్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో దర్శనానికి వచ్చిన భక్తులకు సోమవారం సాయంత్రం వేలాది మజ్జిగ ప్యాకెట్లు, బిస్కెట్లు, వాటర్ ప్యాకెట్లు అందించారు. ఈ వ్యానును మార్కాపురం వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ అన్నా రాంబాబు తనయుడు అన్నా కృష్ణచైతన్య ప్రారంభించారు. అసలే ఉక్కపోతతో తిరునాళ్లకు వచ్చిన భక్తులకు అందించిన మజ్జిగ, మంచినీటి ప్యాకెట్లతో కొంత ఉపశమనం పొందారు. భక్తులు నాయకులను అభినందించారు. కార్యక్రమంలో తుమ్మా వెంకటరెడ్డి, గాయం శ్రీనివాసరెడ్డి, జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీఓగా వెంకట్రావు బాధ్యతల స్వీకరణ

ముండ్లమూరు (కురిచేడు): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏపీఓగా వెంకట్రావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ ఏపీఓగా పనిచేసిన నాగరాజు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో పొదిలి నుంచి బదిలీపై వచ్చిన వెంకట్రావు విధుల్లో చేరారు. అర్హులైన ప్రతి ఒక్కరికి జాబ్‌కార్డు కల్పిస్తామని, పనులు అడిగిన ప్రతి ఒక్కరికి పనులు కల్పిస్తామని తెలిపారు.

క్యూలో చెప్పులు.. ఇటుక రాళ్లపై పేర్లు

- ఆధార్‌లో అప్‌డేట్ కోసం లబ్ధిదారుల అవస్థలు
- క్యూలైన్లలో చెప్పులు, ఇటుక రాళ్లపై పేర్లు రాస్తున్న వైనం
- కూటమి ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జనం



ఆధార్ అప్‌డేట్ కోసం చెప్పులు, రాళ్లను క్యూలో ఉంచిన లబ్ధిదారులు



బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద వేచి ఉన్న లబ్ధిదారులు

గిద్దలూరు రూరల్: ఎక్కడైనా క్యూలో చెప్పులు పెడుతుండటం చూశారా.. ? చూసే ఉంటాం. ఎక్కడంటే రైతులు విత్తనాల కోసమనో, ఎరువుల కోసమనో చూసి ఉంటాం. కాని విచిత్రం ఏంటంటే ఆధార్ అప్‌డేట్ కోసం క్యూలో చెప్పులు ఉంచడం ఇప్పుడు చూస్తున్నాం..

గిద్దలూరు పట్టణంలో ఆధార్ అప్‌డేట్ కోసం బారులు తీరుతున్నారు. ఇందుకు ఎక్కువ సేపు క్యూలో నిల్చోలేక చెప్పులను ఉంచుతున్నారు. కూటమి ప్రభుత్వం కొత్తగా రేషన్ కార్డులల్లోని సభ్యులకు ఈ–కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలనే నిబంధన ప్రవేశపెట్టింది. దీంతో ఈకేవైసీ చేయించుకునేందుకు ఆధార్ అప్‌డేట్ తప్పనిసరి చేశారు. దీంతో రేషన్ కార్డుల్లో తమ పిల్లల పేర్లు నమోదు చేయించుకునేవారు, వేలిముద్రలు సక్రమంగాపడని లబ్ధిదారులు పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద రాత్రులు సైతం క్యూలో నిలుచుని వారి స్థానంలో చెప్పులు, ఇటుక రాళ్లపై వారి పేర్లతో రాసి ఉంచిన చీటీలను వరుస క్రమంలో ఉంచుతూ అవస్థలు పడుతున్నారు. వేసవి కావడంతో ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటోంది.

పథకాలు ఎగరగొట్టేందుకే ఈ పనులు..

ఆధార్ చేయించుకునేందుకు వచ్చిన లబ్ధిదారులను ఇబ్బందులకు గురిచేసే విధంగా ప్రభుత్వ విధానం ఉందని కొందరు మండిపడుతున్నారు. ప్రభుత్వ పథకాలు పొందాలంటే ప్రతి ఒక్క పేదవాడికి రేషన్‌కార్డు తప్పనిసరిగా ఉండాలి. రేషన్ కార్డుల ఏరివేతకు ప్రభుత్వం పొంతనలేని పనులను ప్రారంభిస్తుందని కొందరు విమర్శిస్తున్నారు. బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో ఒక్కచోటనే కేంద్ర ఉండటం వల్ల లబ్ధిదారుల రద్దీ పెరగడం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయి. లబ్ధిదారులకు సరిపడా సిబ్బందిని ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం విఫలం అవడం వల్ల సమస్య మరింత జఠిలమవుతోంది. ప్రజలకు ఇబ్బందులకు గురిచేసే ఇటువంటి చర్యలను ఉన్నతాధికారులు పరిశీలించి ఇబ్బందులు లేకుండా చూడాలని లబ్ధిదారులు కోరుతున్నారు. గత ప్రభుత్వం సచివాలయం కేంద్రంగా ఆధార్ అప్‌డేట్ కేంద్రాలు ఉండేవి. ప్రస్తుతం ఆ విధమైన వెసులుబాటు లేకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

వక్ఫ్ బిల్లు రద్దు చేయాలని ముస్లింల ప్రదర్శన



శాంతి ర్యాలీలో పాల్గొన్న ముస్లింలు, ప్రజా సంఘాల నాయకులు

మార్కాపురం: వక్ఫ్ సవరణ బిల్లును వెంటనే రద్దు చేయాలని ముస్లింలు, ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ముస్లింల మనోభావాలను దెబ్బ తీసేవిధంగా కేంద్ర ప్రభుత్వం ఈ చట్టం చేసిందని సీపీఎం నాయకులు డీకేఎం రఫీ, సీపీఐ నాయకులు ఎస్‌కె ఖాశీం, ఎంపీజె నాయకులు నాగూర్‌మీరావలి అన్నారు. కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం ముస్లింలకు వ్యతిరేకంగా బిల్లులు తెచ్చిందని, వక్ఫ్ బోర్డులో ముస్లిమేతరుల నియామకాన్ని తాము సహించమన్నారు. బిల్లును వెంటనే ఉప సంహరించుకోవాలని కోరారు. సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చారు. రైతు సంఘం కార్యదర్శి గాలి వెంకటరామిరెడ్డి, సీపీఐ నాయకులు నాసరయ్య, సీపీఎం నాయకులు సోమయ్య, తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదిపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



నిరసన తెలియజేస్తున్న న్యాయవాదులు

గిద్దలూరు రూరల్: న్యాయవాదిపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని గిద్దలూరు కోర్టు న్యాయవాదులు సోమవారం విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. గుంటూరు బార్ అసోషియేషన్‌లో న్యాయవాదిగా పనిచేస్తున్న దోన్వాన్ క్రిష్ణ తన కేసు నిమిత్తం ఈ నెల 17వ తేదీన గిద్దలూరు కోర్టులో కేసు వాదించి తిరిగి కోర్టు బయటకు వెళ్తున్న సమయంలో కేసు ప్రతివాదిలు అతడిపై దాడికి పాల్పడటం శోచనీయమన్నారు. ఈ విషయమై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికి పోలీసులు పట్టీపట్టనట్లు వ్యవహరించడం చాలాదారుణం అన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి దాడికి పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు శేషయనారెడ్డి, ఉపాధ్యక్షుడు ఉస్మాన్‌షరీఫ్, న్యాయవాదులు మల్లికార్జునరావు, బాలరాజు, రాజ్‌కుమార్, రంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నాలుగు నూతన బస్సులు ప్రారంభం



నూతన బస్సుల ప్రారంభోత్సవంలో అధికారులు

మార్కాపురం: మార్కాపురం డిపోకు వచ్చిన నాలుగు నూతన బస్సులను సోమవారం డిపో మేనేజర్ నరసింహులు, ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి కలిసి ప్రారంభించారు. 2 సూపర్ లగ్జరీ బస్సులు బీహెచ్‌ఈఎల్‌కు, 2 సూపర్ ఎక్స్‌ప్రెస్ బస్సులు ఒంగోలుకు కేటాయించినట్లు డిపో మేనేజర్ తెలిపారు. ప్రయాణికులు ఆర్టీసి బస్సుల్లోనే ప్రయాణించాలని తెలిపారు.

గజ వాహనంపై దేవదేవుని దర్శనం

- వాహనసేవలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి అన్నా



గజవాహనంపై దర్శనమిస్తున్న స్వామివారు



వాహనసేవలో పాల్గొన్న అన్నా కుటుంబ సభ్యులు

మార్కాపురం టౌన్: శ్రీదేవీ, భూదేవీ సమేత లక్ష్మిచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారు ఉభయ దేవేరులతో కలిసి సోమవారం వేకువజామున గజవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 4 గంటలకు స్వామివారిని గజ వాహనంపై ఆలయం నుంచి ఊరేగింపు ప్రారంభించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, కళా రూపాలు, కోలాటాలు, నృత్యాలు, డప్పుల వాయిద్యాలు, భక్తుల జై చెన్నకేశవ.. జైజై చెన్నకేశవ నామస్మరణల మధ్య తేరుబజారు, అమ్మవారిశాల, మెయిన్ బజారు, దోర్నాల సెంటరు, నాయుడు బజారు మీదుగా స్వామివారి ఉత్సవం ఆలయానికి చేరింది. మార్కాపురం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు దంపతులు ఆయన తనయుడు కృష్ణచైతన్య తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం మహాదానం..

అన్నదానం మహాదానమని మార్కాపురం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు చెప్పారు. లక్ష్మి చెన్నకేశవస్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా దివంగత గుంటక వెలుగొండారెడ్డి జ్ఞాపకార్థం సిదార్థ జూనియర్ కళాశాల మిత్ర మండలి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని రాంబాబు ప్రారంభించారు. స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తుల కోసం అన్నదానం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రీడింగు రూము అధ్యక్షుడు గుంటక సుబ్బారెడ్డి, గుంటక శ్రీనివాసరెడ్డి, మాజీ జడ్పీటీసీ రంగారెడ్డి, బట్టగిరి తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. రీడింగు రూము ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా వచ్చిన భక్తులకు మజ్జిగ ప్యాకెట్లను సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ఐ బాలసుబ్బారావు, గుంటక సుబ్బారెడ్డి, ఉపాధ్యక్షుడు శాసనాల వీరబ్రహ్మం, ఆర్‌కెజె నరసింహం, జనసేన ఇన్‌చార్జి కాశీనాథ్ తదితరులు ప్రారంభించారు. అంతకుముందు రథం వద్ద మాజీ ఎమ్మెల్యే కేపీ కొండారెడ్డి టెంకాయ కొట్టి పూజలు చేశారు.

ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో..

ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో తిరునాళ్లకు వచ్చిన భక్తులకు అన్నదానాన్ని ఏపీయూ డబ్ల్యుఏజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు, జిల్లా అధ్యక్షులు ఎస్‌వి రమణ, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు డీ మోహన్‌రెడ్డి ప్రారంభించారు. సుమారు 1000 మంది భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో పలువురు పాత్రికేయులు పాల్గొన్నారు.



రథం వద్ద టెంకాయ కొడుతున్న మాజీ ఎమ్మెల్యే కేపీ కొండారెడ్డి



అన్నదానం ప్రారంభిస్తున్న అన్నా రాంబాబు



విద్యుత్ వెలుగుల్లో లక్ష్మిచెన్నకేశస్వామి ఆలయం

విద్యార్థికి అభినందనలు



చాతుర్యను సన్మానిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

బేస్తవారిపేట: స్థానిక ఆల్ఫా పాఠశాల వీధికి చెందిన తమ్మినేని చాతుర్య కంభం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతూ హెచ్‌ఈసీ గ్రూప్‌లో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించింది. ఏడో తరగతి నుంచి పదో తరగతి వరకు బేస్తవారిపేటలోని జెడ్పీ బాలికల హైస్కూల్‌లో చదివారు. ప్రతిభ కనపరిచిన పూర్వ విద్యార్థిని పాఠశాల హెచ్‌ఎం కర్నాటి తిరుపతిరెడ్డి, ఉపాధ్యాయులు శాలువతో సన్మానించారు. ఉపాధ్యాయుల సహకారంతో పేద విద్యార్థికి ఆర్థిక సహాయం చేశారు.

ప్రైవేటు బ్యాంకు అండర్ గ్రౌండ్‌లో అగ్నిప్రమాదం



జనరేటర్ నుంచి దట్టంగా వ్యాపించిన పొగలు

మార్కాపురం: పట్టణంలోని కళాశాల రోడ్డులో ఉన్న ఓ ప్రైవైటు బ్యాంకు అండర్ గ్రౌండ్‌లో జనరేటర్‌ల షార్ట్ సర్క్యూట్ ఏర్పడి అగ్నిప్రమాదం సంభవించిన ఘటన సోమవారం జరిగింది. అగ్ని మాపక అధికారి ఆర్ రామకృష్ణ వివరాల మేరకు.. ప్రైవేటు బ్యాంకు కింద ఉన్న జనరేటర్లో షార్ట్‌సర్క్యూట్ ఏర్పడి అందులో నుంచి మంటలు చెలరేగాయి. జనరేటర్‌తో పాటు ఏసీ ఔట్‌డోర్‌లు, ఇతర సామగ్రి కాలిపోయాయి. సమాచారం అందుకున్న తమ సిబ్బంది మంటలను అదుపుచేసినట్లు తెలిపారు.

చప్టాలపై రక్షణ గోడలు లేక ప్రమాదాలు



రేగడపల్లి వద్ద మూల మలుపులో ఉన్న చప్టా

కొనకనమిట్ల: మండలంలోని ఎదురాళ్లపాడు–వాగుమడుగు రహదారి మధ్యలో ఉన్న చప్టాలు ప్రమాదకరంగా ఉన్నాయి. ఎదురాళ్లపాడు సమీపంలో వాగుపై ఉన్న చప్టా, రేగడపల్లి మూల మలుపులో వాగుపై, కొనకనమిట్ల, కాట్రగుంట వెళ్లే రహదారి కాట్రగుంట, పేరారెడ్డిపల్లి సమీపంలో చప్టాలు నిర్మించారు. అయితే నూతన రహదారి ఏర్పాటు చేసే సమయంలో కాని, చప్టాలకు మరమ్మతులు చేపట్టేటప్పుడు కానీ చప్టాలపై రిటెయినింగ్ వాల్స్ నిర్మించకకుండా అలాగే వదిలేశారు. దీంతో చప్టాల వద్ద వాహనాలు ఎదురు పడినపుడు డ్రైవర్లతో పాటు ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. సైడు ఇచ్చే క్రమంలో ప్రమాదవశాత్తు పక్కనున్న వాగులో పడే అవకాశం ఉందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రేగడపల్లి వద్ద ఉన్న చప్టా మూలమలుపులో ఉండటం వలన స్పీడుగా వచ్చే వాహనాలు ప్రమాదానికి గురైయ్యే అవకాశం ఉంది. అధికారులు స్పందించి చప్టాల వద్ద సైడు గోడులు నిర్మించాలని, మూల మలుపుల వద్ద ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలని గ్రామాల ప్రజలతో పాటు వాహనదారులు కోరుతున్నారు.

కూరగాయల షాపులు తెరిపించాలని వినతి



సబ్ కలెక్టర్‌కు వివరిస్తున్న సీపీఎం నాయకులు

మార్కాపురం: పట్టణంలో కూరగాయల మార్కెట్‌లో హోల్‌సేల్ వ్యాపారులు తిరునాళ్ల పేరుతో చేస్తున్న దోపిడీకి అడ్డుకట్ట వేసి అక్రమంగా మూసివేసిన కూరగాయల షాపులను తెరిపించాలని సీపీఎం నాయకులు సోమవారం సబ్‌కలెక్టర్ త్రివినాగ్‌కు వినతిపత్రం అందజేశారు. స్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రజలకు అందుబాటులో ఉంచాల్సిన కూరగాయలను అక్రమంగా వేలం నిర్వహించి మిగిలిన షాపులను మూసివేసి అధిక ధరలకు విక్రయిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు దగ్గుబాటి సోమయ్య సబ్‌కలెక్టర్‌ను కోరారు. కూరగాయలను బ్లాక్ మార్కెట్‌కు తరలించి ఒకటి, రెండు షాపులకు మాత్రమే పర్మిషన్ ఇచ్చి అక్కడ అధిక ధరలకు విక్రయించడంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి రఫీ, జవ్వాజి రాజు తదితరులు పాల్గొన్నారు.